చతుర మళ్ళీ తనే ఒక ఆలోచన చెప్పింది. "మన యింటిని అద్దెకిద్దాం. ఆ అద్దె అప్పు కింద చెల్లవడదాం. అప్పు తీరాక యింట్లోకి వెడదాం. ఎలాగో యిన్నాళ్ళు యిక్కడే వున్నాం గదా, మరో రెండు మూడేళ్ళు కళ్ళు మూసుకుంటే మన కష్టాలు తీరుతాయి" అని ఓదార్చింది. భార్య సలహా ఆచరించక తప్ప లేదు. అంత డబ్బుపెట్టి, అంత కష్టపడి కట్టుకున్న యింట్లో వుండడానికి నోచుకో లేదు.

* * *

హరిబాబు కష్టాలు అంతటితో తీరలేదు. యిల్లు మూడేళ్ళ కంట్రాక్టుమీద అద్దెకిచ్చాడు. కాని అతనున్న యింటి యజమాని యిల్లు ఖాళీ చెయ్యమని నోటీసిచ్చాడు. హరిబాబు కదిలితేగాని అద్దె పెరగదని తెలుసు అతనికి. ఇప్పుడు హరిబాబుకి యింటి సమస్య తలెత్తింది. స్వంత ఇంటికి వెళ్లాలన్నా మూడేళ్ల కంట్రాక్టు రాశాడు. మరో ఇల్లు యింత ప్రయత్నించినా దొరకలేదు. ఆఖరికి ఇల్లుగలాయనతోపాటు కోర్టుకెక్కాడు.

ఆఖరికి కేసు యిల్లుగలాయన గెలిచాడు. అప్పటికి అతను రిటైరయ్యాడు. మళ్ళీ హరిబాబు అద్దెయిళ్ల వేటలో పడ్డాడు. □

---

మినీ కథ

# తనదాకా వస్తే?

"ఇవ్వాళ మా ఆయనకి లేబ్‌లో పనుంధిట. కూరగాయలకి వెళ్దాం వస్తారా?" రాధాదేవి విమలగార్ని అడిగింది. ఆవిడ వెంటనే ఒప్పుకుంది. ప్రతి ఆది, శుక్ర మంగళవారాలు కళ్యాణ్‌పూర్‌లో సంత జరుగుతుంది. కూరలు చవగ్గా దొరుకుతాయి. విమలగారు తయారై వచ్చింది సంచీ, బుట్టలతో. యిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"మొన్న ఆ మీనాక్షి గారితో వెళ్ళానా? మొగుడు అసిస్టెంట్ ప్రొఫసరయినా అంత పీనాసేమిటండీ ఆవిడ! కళ్యాణ్‌పూర్‌కి టెంపోవాడు తీసుకున్నది లక్షనా ఏమన్నానా? మహా అయితే పావలా! అదికూడా ఖర్చు ఆవిడకి. అంతవరకూ నడిచే వెళ్దామంది. ఎంత గీసి గీసి బేరమాడుతుందనుకున్నారూ? నాకు చిరాకు బాబు" అంది రాధాదేవి.

"మరే! ఏమిటో ఆ కక్కుర్తి. కట్టుకు పోతుందా ఏమన్నానా?" యిద్దరూ టెంపో కోసం చూడసాగారు. అరగంట గడిచినా టెంపోల జాడలేదు.

"ఈపాటికి నడిస్తే వెళ్ళిపోయి వుండేవాళ్ళం. ఈ టెంపో ఇంక అరగంటకైన వస్తుందో రాదో? పిల్లలు వచ్చేవేళకి ఏదో ఒక టిఫిన్ చెయ్యాల" రాధాదేవి విసుక్కుంది.

"మరే! మావారుకూడా టీకి ఎవర్నోపిల్చారు. అప్పుడే మూడైనట్టుంది, పోనీ నడుద్దామా?" విమలగారు అంది.

"నడుద్దాం పదండి. పట్టుమని పదినిముషాలుకూడా పట్టదు. ఎంత దూరం ఏమిటి? టెంపోవాడు పావలా మింగుతాడు. పావలా అయినా పొదుపు పొదుపేకదండీ. నడక ఒంటికి ఆరోగ్యం కూడాను. ఏమంటారు?"

"బాగా చెప్పారు. ఈ కాన్పూరు నీళ్ళకి తెగ ఒళ్ళు వస్తుందండీ. ఎంత తిండి మానేసినా తగ్గదు. యిలా అప్పుడప్పుడు నడవడం మంచిదే!"

—ముక్కామల వసుంధరాదేవి.